మల్లన్న జాతరకు ఆహ్వానం



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను ఆహ్వానిస్తున్న కోకాపేట నాయకులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కోకాపేట గ్రామంలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న మల్లన్న జాతరకు హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కౌన్సిలర్ జి. శివారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ, గ్రామ నాయకులు శుక్రవారం కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల పాటు ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని, భక్తులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు హరిశంకర్, గణేశ్, విశ్వనాథ్, మల్లేశ్, రాముయాదవ్, అంజయ్య, సాయిలు, బాలకృష్ణయ్య పాల్గొన్నారు.

ఏసీపీగా లక్ష్మీనారాయణ బాధ్యతల స్వీకరణ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా లక్ష్మీనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన గంగాధర్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. నార్సింగి ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న ఈయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఏసీపీ లక్ష్మీనారాయణను రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ ఎస్‌హెచ్‌ఓలు, సబ్ ఇన్‌స్పెక్టర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాజేంద్రనగర్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా ..



అబ్దుల్ ఖాదర్

రాజేంద్రనగర్/అత్తాపూర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా అబ్దుల్ ఖాదర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చార్మినార్ సర్కిల్‌లో పని చేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. అనంతరం ఉప కమిషనర్ రవి కుమార్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండ్లు నిర్మించుకునే యజమానులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. దళారులను నమ్మవద్దని ఎలాంటి సమస్య ఉన్నా.. నేరుగా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

'కుండ గుర్తుకు ఓటు వేసి గెలిపించండి'

రాజేంద్రనగర్: అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా బరిలో ఉన్నానని కుండ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని గుంటి రాజ్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. సంఘం ఎన్నికలు ఈ నెల 18వ తేదీన ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరగనున్నాయని పేర్కొన్నారు.

నేడు సైంటియా సైన్స్ ఎక్స్‌పో

గోల్కొండ: విద్యార్థుల మేధకు పదునుపెట్టేందుకు వారికి ఎన్నో రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రవీంద్రభారతీ పాఠశాలల మెహిదీపట్నం జోన్ డీన్ ప్రియమనీష్ అన్నారు. శుక్రవారం టోలిచౌకీ సూర్యనగర్ కాలనీలోని రవీంద్రభారతీ పాఠశాలలో ఆమె మాట్లాడుతూ.. నేడు పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సైంటియా సైన్స్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రాథమిక తరగతుల విద్యార్థుల కోసం సైంటియా సైన్స్ ఎక్స్‌పో విద్యార్థుల మేధకు ఒక వేదికలాంటిదని ఆమె అన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ సైన్స్ ఎక్స్‌పో ఉంటుందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు భౌగోళిక, ఖగోళ, శాస్త్ర సంబంధమైన ఎన్నో అద్భుత ప్రదర్శనలు ఈ సైన్స్ ఎక్స్‌పోలో ఉంటాయని ఆమె తెలిపారు.

మహిళ మెడలోని గొలుసు చోరీ

రాజేంద్రనగర్: ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును చైన్ స్నాచర్లు ఎత్తుకెళ్లిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన నిషిత (35) గురువారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో బజార్‌కు వెళ్లేందుకు జనప్రియ అపార్ట్‌మెంట్ ప్రాంతంలోని రోడ్డుపైకి వచ్చింది. ఇదే సమయంలో బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వెనుక నుంచి వచ్చి నిషిత మెడలోని మూడున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని ఉడాయించారు. ఈ ఘటనతో నిషిత మెడకు గాయమైంది. ఆమె తేరుకొని స్థానికులకు సమాచారం అందించేలోపే నిందితులు పారిపోయారు. దీంతో బాధితురాలు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా నంబర్ ప్లేట్ లేని వాహనంపై నిందితులు వచ్చినట్టు పోలీసులు గుర్తించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని వారు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



అనిల్ సింగ్ గౌరవ్

అత్తాపూర్: ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, కానిస్టేబుల్ విక్టరీ శివ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన అనిల్ సింగ్ గౌరవ్ (27) నాలుగేళ్ల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి బతుకుదెరువు కోసం అత్తాపూర్‌కు వచ్చాడు. క్యాబ్, ఆటో డ్రైవింగ్ చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ నెల 11 న మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రెండున్నర గంటల సమయంలో తల్లి కామేశ్‌కు ఫోన్‌చేసి రూ.600 ఫోన్ పే చేయాలని కోరాడు. అనంతరం కుమారుడితో మరోసారి మాట్లాడేందుకు ప్రయత్నించగా.. ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకుండా పోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కెనడాలో నగర విద్యార్థి మృతి

గోల్కొండ: హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి కెనడాలో మృతి చెందాడు. టోలిచౌకీ బాల్‌రెడ్డినగర్‌కు చెందిన షేక్ ముజాఫర్ అహ్మద్ కుమారుడు షేక్ ముజామిల్ అహ్మద్(25). ఐటీలో మాస్టర్స్ డిగ్రీ చేయడానికి 2022లో కెనడా వెళ్లాడు. ఒంటారియో సిటీ కిచెన్నర్‌లోని కనెస్టోగా కాలేజ్‌లో ఎంఎస్‌ఐటీ డిగ్రీ చేస్తున్నాడు. వాటర్లు క్యాంపస్‌లో ఉంటున్నాడు. గత కొన్ని రోజులుగా షేక్‌ముజామిల్ అహ్మద్ వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నాడు. కార్డియాక్ అరెస్టుతో శుక్రవారం ఉదయం మృతి చెందాడు.

ఎమ్మెల్యే పరామర్శ

షేక్ ముజామిల్ అహ్మద్ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. బాల్‌రెడ్డినగర్‌లో నివసించే మృతుడి తండ్రి షేక్ ముజాఫర్ అహ్మద్‌ను ఆయన మృతుడి కుటుంబానికి తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. అసదుద్దీన్ ఒవైసీ దృష్టికి తీసుకువెళ్లి మృతదేహాన్ని ఇండియాకు రప్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే షేక్ ముజాఫర్‌కు హామీ ఇచ్చారు. ఆయన వెంట కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

బల పరీక్ష వాయిదా



అధికారుల తీరును నిరసిస్తూ ఆందోళన చేస్తున్న కార్పొరేటర్లు

- అవిశ్వాసంపై హైకోర్టు స్టే
- బండ్లగూడ కమిషనర్ శరత్‌చంద్ర వెల్లడి
- ఏకపక్ష నిర్ణయం అంటూ కార్పొరేటర్ల ఆందోళన

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్‌పై 16 మంది కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై హైకోర్టు స్టే విధించిందని కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకూరి శరత్‌చంద్ర తెలిపారు. శుక్రవారం అవిశ్వాసంపై చర్చించేందుకు ముహూర్తం ఖరారైన విషయం తెలిసిందే. అయితే గురువారం హైకోర్టు స్టే విధించడంతో బల నిరూపణ ప్రక్రియ నిలిచిపోయింది. రాజేంద్రనగర్ ఆర్‌డీఓ బదిలీపై వెళ్లడంతో చేవెళ్ల ఆర్‌డీఓ సాయిరాం ఎలక్షన్ అధికారిగా వ్యవహరించారు. అధికారులు అసమ్మతి కార్పొరేటర్లకు హైకోర్టు స్టే పత్రాలు అందజేశారు. దీంతో జరగాల్సిన సమావేశం వాయిదా పడింది.



అవిశ్వాస సమావేశానికి హాజరైన అసమ్మతి కార్పొరేటర్లు

ఏకపక్ష నిర్ణయం..

నెలరోజులకు పైగా క్యాంపులో ఉన్న 16 మంది అసమ్మతి కార్పొరేటర్లు శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చారు. అయితే హైకోర్టు స్టే ఇచ్చిందని తెలిసి నిరాశకు గురయ్యారు. దీనిని తప్పుపడుతూ ఇది ఏకపక్ష నిర్ణయం అంటూ ఆరోపించారు.

కలెక్టర్ ఎందుకిలా చేశారు?

అసమ్మతి కార్పొరేటర్లు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం 30 రోజుల్లో పూర్తి చేయాల్సిన అవిశ్వాస బల నిరూపణ ప్రక్రియకు కలెక్టర్ శశాంక ఎందుకు ఎక్కువ రోజుల సమయం ఇచ్చారని, కలెక్టరే ఇలా చేస్తే తమకు న్యాయం ఎలా జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీని వెనకాల ఎవరో ఉండి నడిపిస్తున్నారని, మేయర్ మహేందర్‌గౌడ్ అవినీతి, నియంతృత్వ విధానాలు, తన మాటే వినాలి అనే ధోరణి, ఒంటెద్దు పోకడల వల్లే ఆయనపై అవిశ్వాసం పెట్టాల్సి వచ్చిందని, తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

అధికారులు తమను తప్పుదోవ పట్టించేందుకే సరైన సమయంలో స్టే ఆర్డర్ కాపీ ఇవ్వలేదని, కార్పొరేషన్ కార్యాలయానికి రాకుంటే అవిశ్వాసం వీడిందనే ప్రయత్నం జరిగేదని, కోర్టు స్టే వచ్చిన తర్వాత ఆర్‌డీఓ మున్సిపల్ కార్యాలయానికి ఎందుకు వచ్చారని వారు ప్రశ్నించారు.

సోషల్ మీడియాలో..

మేయర్ మహేందర్‌గౌడ్ వర్గం సోషల్ మీడియాలో ధర్మమే గెలిచింది అని పోస్టులు పెట్టడంతో వ్యవహారం మరో మలుపు తిరిగింది. అసమ్మతి కార్పొరేటర్లు మాత్రం ఓటింగే జరగలేదని, కార్పొరేషన్‌లో మొత్తం 21 మంది కార్పొరేటర్లు ఉంటే మేయర్ వర్గంలో కేవలం ఐదుగురే కార్పొరేటర్లు ఉన్నారని, దీనిని విజయంగా ఎలా భావిస్తారని ఎద్దేవా చేశారు. నైతికంగా తామే గెలిచామని అసమ్మతి కార్పొరేటర్లు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఏకంగా పటాకులు కాల్చడం విశేషం.

కార్మికులకు అన్యాయం చేయొద్దు

కంట్రోల్ కమిషన్ రాష్ట్ర సభ్యుడు పుస్తకాల నర్సింగ్‌రావు



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న నర్సింగ్‌రావు

మణికొండ: కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడి అన్యాయం చేస్తుందని, కొత్తగా చేసిన కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్‌రావు డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా శుక్రవారం నిర్వహించిన భారత్‌బంద్‌లో భాగంగా నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి ఎస్. మల్లేశ్, నాయకులు ఎం. శంకరయ్య, సీపీఐ మండల కార్యదర్శి ఎం.బాబురావు, ఏఐటీయూసీ మండల కార్యదరిశ పి. స్వామి, నాయకులు కిశోర్, సత్యనారాయణ రెడ్డి, నారాయణ, భిక్షపతి, మల్లేశ్, నరేశ్, రమేశ్, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి..

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్, పింఛన్ సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ కోరారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో భారత్‌బంద్‌లో భాగంగా కార్మికులతో కలిసి ర్యాలీలు, నిరసనలు, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది కార్మికులు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, వారికి రూ. 25 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఎనిమిది గంటల పని విధానం, ఆదివారం, పండగలకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, మండల కన్వీనర్ డి. ప్రవీణ్‌కుమార్, నాయకులు ఎం. అశోక్, యాదగిరి, సురేశ్, సుధారాణి, జ్యోతి, లత, అరుణ, సునీల్ చారి, కార్మికులు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో..

శంషాబాద్: దేశ వ్యాప్త గ్రామీణ బంద్ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. సీఐటీయూ మండల కన్వీనర్ మల్లేశ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి తహసీల్ కార్యాలయం గుండా అంబేద్కర్ విగ్రహం వరకు కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం కార్యవర్గ సభ్యులు జాన్‌వెస్లీ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చి యజమానులకు అనుకూలంగా మార్చిందన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని సంఘం జిల్లా నాయకుడు నగేశ్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ఏళ్లుగా వెట్టిచాకిరీ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కొత్త ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీని నెరవేర్చడంలో నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు.

మోదీవి కార్మిక వ్యతిరేక విధానాలు

రాజేంద్రనగర్: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని మున్సిపల్ రంగం ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. దేశవ్యాప్త కార్మిక సంఘాల గ్రామీణ బంద్‌కు మద్దతుగా రాజేంద్రనగర్ మండల కేంద్రంలోని ఆరాంఘర్ చౌరస్తాలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీ, రాస్తారోకోలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నో పోరాటల ద్వారా ప్రాణాలర్పించి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులకు, రైతులకు అన్యాయం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్, కిరోసిన్ ధరలు విపరీతంగా పెంచి సామాన్యుల నడ్డి విరిచిందన్నారు. అలాగే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్ రెడ్డి, టి.ఆనంద్, ఎ.సాయిలు, ఎ.రాజు, పెంటయ్య, అంజి, బాల్‌రాజు, ప్రమీల, సంతోష, సునీత, లక్ష్మమ్మ, శ్యామలమ్మ, శాంతమ్మ, నాగమ్మ, కార్మికులు పాల్గొన్నారు.



శంషాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు



ఆరాంఘర్ చౌరస్తాలో ర్యాలీ, రాస్తారోకోలో పాల్గొన్న జైపాల్ రెడ్డి, కార్మికులు

మున్సిపల్ కమిషనర్లకు శుభాకాంక్షల వెల్లువ



నార్సింగి మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్‌ను కలిసిన కేపీఆర్ కాలనీ నాయకులు

మణికొండ: నూతనంగా బాధ్యతలు చేపట్టిన నార్సింగి, మణికొండ మున్సిపల్ కమిషనర్లకు పలు కాలనీ సంక్షేమ సంఘాలు, పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మున్సిపాలిటీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. ఆయన వెంట పార్టీ నాయకులు రాము, వేణుగౌడ్, వినోద్ కుమార్, డి. కిరణ్‌కుమార్, గండయ్య, కిరణ్ కుమార్, ప్రభుకుమార్ ఉన్నారు. అలాగే మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్ కుమార్‌ను కాంగ్రెస్ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షురాలు ఇందిరారెడ్డి, ఉపాధ్యక్షురాలు ప్రభావతి, కేపీఆర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.రమణారెడ్డి, కార్యదర్శి సింహారాజారెడ్డి, కోశాధికారి గిరిధర్‌తో పాటు కమిటీ సభ్యులు కలిశారు.



మణికొండ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌ను కలిసి మహిళా కాంగ్రెస్ నాయకులు

'అక్రమ అరెస్టులు ఆపాలి'



నార్సింగిలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు

మణికొండ: శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామంలో పంచాయతీ, ఓ చర్చి వర్గాల మధ్య జరిగిన దాడులను దళితులపైన దాడిగా చిత్రీకరించి అక్రమ అరెస్టులు చేస్తున్నారని, వాటిని వెంటనే ఆపాలని వీహెచ్‌పీ రాష్ట్ర నాయకులు రామరాజు, భజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకుడు ధర్మప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామాన్ని సందర్శించి వాస్తవాలను వెలుగులోకి తేవాలనే ఉద్దేశంతో వెళ్తుండగా వారిని నార్సింగిలో పోలీసులు అడ్డుకున్నారు. దాంతో వారు నార్సింగి ఏసీపీ వెంకట రమణగౌడ్‌తో చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ తరపున రోడ్డు వేయాలనుకున్నారని, దాన్ని ఇద్దరు ఫాస్టర్లు అడ్డుకుని ఘర్షణలను ప్రేరేపించారన్నారు. వారి మాట్లాడిన, అక్కడ జరిగిన వాస్తవ పరిస్థితి వీడియాలను పోలీసు అధికారులకు చూపించామన్నారు. ఘర్షణలకు కారణమైన నార్సింగి, జన్వాడ ఫాస్టర్లను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జరిగిన వాస్తవాన్ని వెలుగులోకి తెచ్చేందుకు న్యాయవాదులతో ఓ కమిటీని పంపుతామని అనుమతించాలని పోలీసులను కోరామన్నారు. గొడవ సమయంలో అక్కడ లేని వారిపై సైతం కేసులు నమోదు చేశారని వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ధర్మ ప్రసార సహ ప్రముఖ్ సుభాష్‌చందర్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

సుల్తాన్‌బజార్: నేషనల్ హెల్త్‌మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) స్కీమ్‌లో దాదాపు 17 వేల మంది కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ పద్ధతిన వివిధ విభాగాల్లో ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న వీరిని పర్మనెంట్ చేయాలని ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం.నర్సింహ, రామరాజేష్ కన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కోఠిలోని కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వైద్య ఆరోగ్యశాఖలోని అన్ని క్యాడర్ల ఉద్యోగులందరినీ ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం స్కీమ్‌లో పనిచేస్తున్న వైద్యులను ఏమాదిరిగా రెగ్యులరైజ్ చేశారో అదే మాదిరిగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రమాణ్యం, రాజేశ్వరీరెడ్డి, దుర్గ, స్వప్న, సురేష్ గౌడ్, మధు, హన్మంతు, శిరీష, మానెమ్మ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న గద్దం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్

నాంపల్లి: కొత్తగా ఏర్పడిన నూతన ప్రభుత్వంలో నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గద్దం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం సర్వే ల్యాండ్ శాఖ కేలండర్ ఆవిష్కరణ సభ జరిగింది. సర్వే ల్యాండ్స్ జేడీ ఎ.భాస్కర్, డిప్యూటీ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్ రాముతో కలిసి తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గద్దం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్ కేలండర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నగర శాఖ అధ్యక్షుడు పి.లక్ష్మణరావు, కార్యదర్శి అతీక్ పాష, సర్వే ల్యాండ్స్ శాఖ యూనిట్ అధ్యక్షుడు బి.నాగరాజు, కార్యదర్శి ఎం.ఎ.కరీం, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, కోశాధికారి జలపతిరావు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ దాతృత్వం

సాక్షి, సిటీబ్యూరో: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మేడ్చల్‌లోని గూడవెల్లిలోని కృషి హోమ్ అనాథాశ్రమానికి టాటా వింగర్ స్కూల్ బస్సు, ఓపెన్ జిమ్ పరికరాలను విరాళంగా అందించింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వినయ్ ఎం టోన్సే హైదరాబాద్‌ను సందర్శించిన సందర్భంగా సీఎస్ఆర్ నిధులతో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి సైనిక్ స్కూల్ కోరుకొండ పూర్వ విద్యార్థులచే ఏర్పాటు చేసిన 'సాయికోరియన్'సంయుక్త సహకారాన్ని అందించింది. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ వినయ్ ఎం టోన్సే టాటా వింగర్ స్కూల్ బస్సు తాళంచెవిని సాయికోరియన్ అధ్యక్షుడు భాస్కర్ రావుకు అందజేశారు. ఈ సందర్భంగా టోన్సే మాట్లాడుతూ..ఎప్పటికప్పుడు సామాజికి అభివృద్ధికి ఎస్‌బీఐ తోడ్పాటును అందిస్తుందన్నారు.

'మున్సిపల్'ను తలపిస్తున్న అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు



ప్రచారం నిర్వహిస్తున్న రాజ్ కుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు మున్సిపల్ ఎన్నికలను తలపిస్తున్నాయి. బరిలో నిలిచిన అభ్యర్థులు పోటాపోటీగా అనుచరులతో కలిసి ఇంటింటా తిరుగుతూ ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. అసోసియేషన్‌కు గత 40 ఏళ్లుగా ప్రతి రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఇందులో మొత్తం 529 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు. అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, కార్యదర్శి, కార్య నిర్వాహక కార్యదర్శి తదితర పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. నలుగురితో ఎన్నికల కమిటీని 15 రోజుల క్రితం నియమించారు. బుద్వేల్ బస్తీలో ఎన్నికల హడావిడి ఊపందుకున్నది. అభ్యర్థులు కరపత్రాలు, బ్యానర్లు, వాల్ పోస్టర్లు, స్లిప్పుల ద్వారా ప్రచారాన్ని చేపడుతున్నారు. ప్రతి పదవికి ముగ్గురు నుంచి ఐదుగురు పోటీ పడుతున్నారన్నీ ఈ నెల 18వ తేదీన ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరగనున్నది. అనంతరం ఓట్లను లెక్కించి విజేతను ప్రకటించనున్నారు. రంగారెడ్డి జిల్లాలోనే అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్‌కు ప్రత్యేక స్థానం ఉంది.

నత్తనడకన 'ఇంటిగ్రేటెడ్ మార్కెట్'



పిల్లర్ల దశలోనే నిలిచిన మార్కెట్ పనులు

- ఏడాదిన్నరగా పిల్లర్ల దశలోనే బండ్లగూడ సమీకృత మార్కెట్ పనులు
- రూ.4.50 కోట్ల నిధులతో నిర్మాణం
- త్వరగా పూర్తిచేయాలని ప్రజల విన్నపం

బండ్లగూడ: గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కూరగాయలు, పండ్లు, మాంసం విక్రయాలకు గాను సమీకృత మార్కెట్‌ను అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో రెండేళ్ల క్రితం నిర్మాణానికి శంకుస్థాపన చేయగా, పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.

1.33 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం..

పీరం చెరువు ప్రాంతం సర్వే నంబర్ 33 లోని 1.33 ఎకరాల స్థలంలో రూ. 4.50 కోట్ల నిధులతో వెజ్, నాన్‌వెజ్ అన్నీ ఒకే చోట లభ్యమయ్యేలా అధునాతన మార్కెట్ నిర్మాణానికి 23-06-2022 నాడు ప్రారంభోత్సవం చేశారు. అయితే మొదట్లో పనులు చకచకా జరిగినా.. ప్రస్తుతం మాత్రం పిల్లర్ దశలోనే నిలిచిపోయాయి.

పనులు ఇలాగే జరిగితే నాలుగేళ్లయినా పూర్తికాదు..

కార్పొరేషన్ ప్రజలకు నలువైపులా సకల సౌకర్యాలతో పాటు ప్రధాన జాతీయ రహదారికి అనుకొని ఉండడంతో అందరికీ అందుబాటులో ఉంటుందనుకుంటే పనులు మాత్రం నత్తను తలపిస్తున్నాయి. ఇలాగే జరిగితే ఇంకా నాలుగేళ్లయినా నిర్మాణం పూర్తయ్యే అవకాశాలు లేవని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే ఆలస్యం అవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పెరిగిన జనాభా..

పెరిగిన జనాభాకు అనుగుణంగా దుకాణాలు సైతం పెరుగుతున్నాయి. ప్రస్తుతం కూరగాయలే కాకుండా తినుబండారాలు, బ్యాగులు, వస్త్రాలు, చెప్పులు వంటి అనేక విక్రయాలు ఇరుకైన రోడ్లపైనే వారాంతపు సంతల్లో కొనసాగుతుండడంతో ప్రజలు కొనుగోలు చేయాలంటే సాహసంగా మారింది. దీనికి తోడు ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరగా అందుబాటులోకి తేవాలి..

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో మొత్తం 81 స్టాళ్లు నిర్మిస్తున్నారు. ఇందులో వెజ్ విక్రయించేందుకు 40 స్టాళ్లు, నాన్‌వెజ్ కోసం 26 , పండ్లు, పూలు తదితర అవసరాలకు 15 స్టాళ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ ప్రజలకు మాత్రం త్వరగా అందుబాటులోకి వచ్చే సూచనలు కనిపించడం లేదు. పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించాం..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు నత్తనడకన జరుగుతున్నాయని ఇప్పటికే కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశాం. త్వరగా నిర్మాణం పూర్తిచేయాలని ఆదేశించాం. పనులపై పర్యవేక్షణ చేస్తూ ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. – బి. శరత్‌చంద్ర, కమిషనర్ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్